సాక్షి ఖమ్మం

శనివారం । 11 । జనవరి । 2025



సీఎంతో భేటీలో కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన జరిగిన సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొన్నారు.



సంక్రాంతికి వస్తున్నాం!

ప్రభుత్వ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలోని బస్టాండ్లు రద్దీగా మారాయి.

10లో

గరిష్టం / కనిష్టం
30° / 16°

వాతావరణం

జిల్లాలో శనివారం చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముంది. ఉదయం, రాత్రి మంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన ఖమ్మం దానవాయిగూడెంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం 12–30గంటలకు ఖమ్మంలో మీడియాతో మాట్లాడనున్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షిస్తారు.

ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి..

ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఉదయం 10గంటలకు దమ్మపేట మండలం కట్కూర్‌లో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఉదయం 11గంటలకు పూసుకుంటలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నాక గ్రామస్తులు, ఆయిల్‌పామ్ రైతులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3గంటలకు రఘునాథపాలెం మండలం మంచుకొండలో ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు మంత్రితో కలిసి హాజరవుతారు.

కానిస్టేబుల్ కుటుంబానికి భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కు



కోక్యా కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కోక్యా కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు మంజూరైంది. ఈ మేరకు రూ.8లక్షల చెక్కును ఆయన కుటుంబీకులకు శుక్రవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అందజేశారు. శాఖాపరంగా సహకరించేందుకు పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారని వారికి భరోసా కల్పించారు.

అనుమతి లేకుండా వైద్యశిబిరం



శిబిరంలో పరిశీలిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చింతకాని: అన్ని వ్యాధులను నయం చేస్తామంటూ గ్రామాలకు వైద్యుల పేరిట వచ్చే వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెబుతూ అధికారులు తరచూ తనిఖీలు చేస్తున్నా కొందరి తీరు మారడం లేదు. ఈక్రమంలోనే చింతకాని మండలం గాంధీనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం అగాపే హోలిస్టిక్ న్యూరో క్లినిక్ కన్సల్టెంట్ పేరుతో అనుమతి లేకుండా శిబిరం ఏర్పాటుచేశారు. ఈ విషయమై డీఎంహెచ్‌ఓకు సమాచారం అందగా ఆమె సూచనలతో మండల వైద్యాధికారి ఆల్తాఫ్ తనిఖీ చేపట్టారు. అయితే, ఉద్యోగులు వెళ్లేసరికే నిర్వాహకులు పరికరాలను వదిలేసి పారిపోయారు. ఒక్కొక్కరి వద్ద రూ.500 వసూలు చేసి ఆక్యూపంక్చర్ విధానంలో చికిత్స పేరిట ఆయుర్వేద మందులను అందజేసినట్లు గుర్తించారు. ఈమేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆల్తాఫ్ సూచించారు. తనిఖీల్లో పీహెచ్‌సీ డాక్టర్ సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవం



విన్యాసాలు చేస్తున్న విద్యార్థినులు

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 18వ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకలను ప్రిన్సిపాల్ కవీంద్ర రాయ్, జిల్లా యువజన క్రీడా అధికారి సునీల్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎన్‌సీసీ, స్కౌట్ కేడెట్లు గౌరవ వందనం సమర్పించగా, విద్యార్థులు యోగా, మాస్‌డ్రిల్, రోప్ స్కిప్పింగ్, పిరమిడ్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. అలాగే, భరతనాట్యం ప్రదర్శన ఇవ్వగా ఆహుతులు అభినందించారు. ఈకార్యక్రమంలో పీఅండ్ హెచ్‌ఈ భువన విజయ్‌కుమార్, కోచ్ మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉదయం ఐదు గంటలకు తెరుచుకుంటున్న భద్రాచల రామాలయ ఉత్తర ద్వారం





వైకుంఠ రామా..

వేదపండితుల మంత్రోచ్ఛరణలు.. ధూప దీపాల నడుమ.. జయజయ గంటలు మోగుతుండగా.. రామయ్య స్వామి గరుడ వాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై వేంచేశారు. దివ్యతేజంతో వెలుగొందుతున్న స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వగా.. వేకువజాము నుంచే ఎదురుచూస్తున్న భక్తులు కనులారా వీక్షించి తన్మయత్వం పొందారు. విద్యుత్ దీపాలతో మిరిమిట్లు గొల్పుతున్న రామాలయ ప్రాంగణం.. పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం.. భక్తుల జయజయ ధ్వానాలు, శ్రీరామనామ స్మరణ వెరసి భద్రగిరి భూలోక వైకుంఠంగా మారింది. ముక్కోటిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున శ్రీసీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకుని భక్తులు పరవశించారు. –భద్రాచలం

నీ దర్శనం ముక్కోటి పుణ్యఫలం

- కనుల పండువగా ఉత్తర ద్వార దర్శనం
- స్వామివారిని వీక్షించి పరవశించిన భక్తులు
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన భద్రగిరి
- భద్రాచలంలో అట్టహాసంగా వైకుంఠ ఏకాదశి



స్వామివారి ఉత్సవమూర్తులు



స్వామివారి సేవలో ప్రముఖులు

ముక్కోటి వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం, ఇల్లెందు, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, ఆలయ ఈఓ రమాదేవి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారుజామున సంప్రదాయబద్ధంగా..

భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన ఉత్తర ద్వార దర్శనం నేత్రపర్వంగా సాగింది. తొలుత శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవలు, విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారు ఆలయ మర్యాదలతో వెండి గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి రాగా, దేవస్థాన హరిదాసులు శ్రీరామ కీర్తనలను పాడారు. ఆ తర్వాత స్థానాచార్యులు కేఈ స్థలశాయి వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యాన్ని వివరించారు. రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతను తెలిపారు. వైకుంఠంలో వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని ముక్కోటి దేవతలు దర్శించుకుంటారని, అందుకే వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం వస్తుందని చెప్పారు. వైకుంఠం నుంచి సరాసరి భద్రిగిరిపై ప్రత్యక్షమైన స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని ప్రాశస్త్యాన్ని వివరించారు.



వేడుకల్లో మంత్రి తుమ్మల, ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్, భక్తులు

ధూప, దీప, నైవేద్యాల నడుమ..

సరిగ్గా ఉదయం 5 గంటలకు జేగంటలు మోగుతుండగా వేదఘోష నడుమ వైకుంఠ ద్వారం తలుపులు తెరుచుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్తర ద్వారంలో ధూప, దీప, నైవేద్యాల నడుమ శ్రీ సీతారామ లక్ష్మణ సమేతంగా రామయ్య స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గంటసేపు ఉత్తర ద్వారంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నివేదన, ఫల నైవేద్యం, మంత్రపుష్పం సమర్పించారు. ఆ తర్వాత వేదపారాయణం జరిపారు. రుగ్వేద, యజుర్వేద, సామ, అధర్వణ వేదాలను పండింతులు పఠించారు. అనంతరం 108 ఒత్తులతో స్వామివారికి హారతి ఇచ్చారు. శరణాగతి, దండకం అనంతరం ద్వార దర్శనం ప్రాశస్త్యాన్ని దేవస్థానం అర్చకులు వివరించారు.

వైభవంగా తిరువీధి సేవ

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన అనంతరం శ్రీసీతారామలక్ష్మణ సమేతుడైన స్వామివారు తిరువీధి సేవకు బయలుదేరి వెళ్లారు. గరుడ వాహనంపై స్వామి వారు, గజ వాహనంపై సీతమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి వారు రాజవీధి మీదుగా తాతగుడి వరకు తిరువీధి సేవకు వెళ్లగా, వారికి ముందు చలవ చప్రంలపై ఆండాళ్, ఆళ్వార్ దేవతలు ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు వెంట నడువగా గోవింద రాజ ఆలయం వరకు వెళ్లిన స్వామివారు ప్రత్యేక పూజలు అందుకుని, తిరిగి రాజ వీధి మీదుగా గ్రామ పదర్శన చేసి ఆలయానికి చేరుకున్నారు.

అ'ధన'పు విధులు...

- నాలా కన్వర్షన్ లేకున్నా రిజిస్ట్రేషన్లు
- వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతనెల 28న 89 రిజిస్ట్రేషన్లు
- ఇందులో 64 డాక్యుమెంట్లపై వివాదంతో విచారణ



వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

వైరా/కొణిజర్ల: ఆ భూములపై కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ విషయం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులకూ తెలుసు. అయినా వెంచర్ నిర్వాహకులు ప్లాట్లు విక్రయిస్తున్నట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్‌కు వెళ్లిన సమయాన తిరస్కరించాల్సిన ఉద్యోగులు అలాంటిదేమీ లేకుండా అ'ధన'పు సమయం కేటాయించి మరీ రాత్రి పొద్దుపోయే వరకు పనులు చక్కబెట్టిన విషయం బయటపడింది. వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతనెల 28న ఒకేరోజు 89 రిజిస్ట్రేషన్లు చేయగా అందులో 64 డాక్యుమెంట్లపై వివాదం నెలకొంది. సదరు వెంచర్ భాగస్వాముల నడుమ విభేదాలతో విషయం వెలుగు చూడడంతో విచారణ చేపడుతున్నారు.

చేతులు మారుతూ...

కొణిజర్ల మండలం లింగగూడెం, అమ్మపాలెం, కొణిజర్ల రెవెన్యూ పరిధి భూముల్లో 2013లో గ్రీన్ ల్యాండ్ పేరిట వెంచర్ ఏర్పాటైంది. 180 ఎకరాల ఈ వెంచర్‌లో 40 ఎకరాల భూమిలో విల్లాలు నిర్మించేలా 2015లో ఇండోఖతార్ సంస్థకు అప్పగించారు. అయితే, అమ్మకాలు సరిగ్గా లేక ఆ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకోగా 2018లో గిరి అనే వ్యక్తికి అప్పగించారు. ఆయన నాలుగేళ్లలో 108 విల్లాలు నిర్మించి ఇవ్వాలనేది ఒప్పందం. కానీ ఆయన 50 విల్లాలు నిర్మించి ఎవరికీ తెలియకుండా అమ్ముకున్నట్లు గ్రీన్‌ల్యాండ్ వెంచర్స్ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇరుపక్షాల మధ్య వివాదం మొదలైంది. ఆపై ఇరువర్గాల ఘర్షణ, భూమిలో మోహరింపుతో పోలీసులు చేరుకుని చర్చలతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఇంతటితో వివాదం ముగిసిందని అంతా భావించారు.

నాలా కన్వర్షన్ వద్దా?

గత నెల 28న వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన 64 రిజిస్ట్రేషన్లపై వివాదం నెలకొనగా నాలుగు సర్వే నంబర్లలోని సుమారు 40 వేల గజాలకు నాలా కన్వర్షన్ కూడా లేదు. డీటీసీపీ, ఎల్ఆర్ఎస్ అనుమతులు కూడా లేకుండానే రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమాన పెద్దమొత్తంలో చేతులు మారగా అధికారుల విచారణ జరుగుతుండగానే విషయం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి వెళ్లింది. దీంతో పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇంతలోనే వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య సెలవుపై వెళ్లగా, కార్యాలయ ఉద్యోగులు భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్యను వివరణ కోరగా లింగగూడెం, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో భూములకు గత నెల 28న 64 రిజిస్ట్రేషన్లు చేసిన మాట నిజమేనని.. ఆ భూములకు డీటీసీపీ, ఎల్ఆర్ఎస్ అనుమతులు ఉన్నాయని చెప్పారు. వెంచర్ నిర్వాహకులు అన్ని పత్రాలు సమర్పించాకే నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని వెల్లడించడం గమనార్హం.

అసలు కథ ఇక్కడే...

వెంచర్‌లో వివాదం పరిష్కారమైందని అందరూ అనుకుంటుండగా.. విల్లాల నిర్మాణ బాధ్యతలు చేపట్టిన గిరి విదేశాల్లో ఉన్నట్లు తెలిసింది. ఈక్రమాన గ్రీన్‌ల్యాండ్ వెంచర్ నిర్వాహకులు భూమి అమ్మకానికి సిద్ధమైనట్లు సమాచారం. ఇందుకు గత నెల 28న ముహూర్తం నిర్ణయించుకుని వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించినట్లు తెలిసింది. ఆపై వివాదాస్పద భూమిలో 64 ప్లాట్ల అమ్మకానికి ఖమ్మంలోని ఓ సీనియర్ డాక్యుమెంట్ రైటర్ దగ్గర పత్రాలు సిద్ధం చేయించుకుని కార్యాలయానికి వచ్చారని సమాచారం. దీంతో ఎంత ఆలస్యమైనా సరేనంటూ అమ్మపాలెం, లింగగూడెం రెవెన్యూ పరిధిలో వివిధ సర్వే నంబర్లకు చెందిన భూములు రిజిస్ట్రేషన్లు పూర్తిచేశారు. వీటికి తోడు ఇతరులవి 25 డాక్యుమెంట్లు ఉండగా అంతా పూర్తయ్యేసరికి రాత్రి పది గంటలు దాటింది. అయితే, ఈ విషయం గిరికి ఆలస్యంగా తెలియడంతో ఆయన ఈనెల 2వ తేదీన సబ్ రిజిస్ట్రార్‌కు లీగల్ నోటీసులు ఇవ్వడమే కాక భవిష్యత్‌లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకుండా లేఖ పంపించారు. ఈమేరకు వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య జిల్లా రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వగా విచారణ చేపట్టారు.

రాజకీయ జన్మ సత్తుపల్లిలోనే...

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: మండలంలోని కాకర్లపల్లి నుంచే తన రాజకీయ ప్రయాణం ప్రారంభమై ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయికి చేరానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం, పాలేరు ఇలా ఎక్కడకు వెళ్లినా సత్తుపల్లికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడు–నాగుపల్లి బీటీరోడ్డు, సత్తుపల్లిలో వ్యవసాయ గోదాంకు శుక్రవారం శంకుస్థాపన చేసిన ఆయన కాకర్లపల్లి సొసైటీ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ప్రారంభించారు. అలాగే, 59 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశాక మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కోసం జాతీయ రహదారిపై కల్లూరు, వేంసూరు వద్ద ఎగ్జిట్లు సాధించామన్నారు. త్వరలోనే యాతాలకుంట టన్నెల్ పూర్తి చేసి గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు. కాగా, సత్తుపల్లి–కొవ్వూరు రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు పంపించామని, సత్తుపల్లికి పామాయిల్ ఫ్యాక్టరీ, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 26న రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమ చేస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి అభివృద్ధి కోసం సింగరేణి నుంచి డీఎంఎఫ్‌టీ నిధులు ఇప్పించాలని మంత్రిని కోరారు.

ఇలాగేనా ఉండేది..

సత్తుపల్లి శివారులో చెత్త, కొబ్బరి బొండాలు వేస్తుంటే ఏం చేస్తున్నారంటూ సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మందలించారు. డివైడర్లలో చెట్లను కాపాడుతూ మున్సిపాలిటీని అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, సింగరేణి జీఎం షాలేంరాజు, ఆర్డీఓ ఎల్.రాజేందర్, పీఏసీఎస్ అధ్యక్షుడు తుమ్మూరు శ్రీరాంప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్లు చల్లగుళ్ల కృష్ణయ్య, గొర్ల సంజీవరెడ్డి, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు, శివ వేణు, ఉడతనేని అప్పారావు, నారాయణవరపు శ్రీనివాస్, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కమల్‌పాషా, వీరివాడ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'గూడెం' విమానాశ్రయ ఏర్పాటుకు అడుగులు



ఖమ్మం వన్‌టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు తథ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కొత్తగూడెం, సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందాలు ఈనెల 20న స్థలపరిశీలన చేయనున్నాయని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గతంలో సూచించిన ప్రాంతంలో భూములు అనుకూలంగా లేవని తేలగా, కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించామని పేర్కొన్నారు. దీంతో అక్కడ సర్వే చేయించాలని తాను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికు లేఖ రాస్తే ప్రత్యేక బృందం పర్యటన ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని బదులిచ్చారని తెలిపారు. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈనేపథ్యాన 20వ తేదీన స్థలాల పరిశీలనకు బృందం రానున్న నేపథ్యాన అవసరమైన ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్, యంత్రాంగాన్ని మంత్రి తుమ్మల ఆదేశించారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలానికి పర్యాటకులే కాక సింగరేణి, భారజల, ఐటీసీ పరిశ్రమలకు దేశ విదేశాల నుంచి ఉన్నతాధికారులు రాకపోకలు సాగించేందుకు ఈ విమానాశ్రయం విదోహదపడుతుందని ఆయన వెల్లడించారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలపై విస్తృత అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: రహదారి ప్రమాదాలను అరికట్టేలా రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ పేరిట బోర్డులు ఏర్పాటు చేయాలని, ఇతర రహదారులపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు గుర్తించాలన్నారు. ఆపై ప్రమాదం జరిగితే ఏ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించవచ్చో మ్యాపింగ్ చేసి అంబులెన్స్‌ల సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే, హైవేలపై ప్రమాదాలు జరిగినప్పుడు 1033 నంబర్‌కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని, బ్లాక్ స్పాట్ల వద్ద వేగనియంత్రణ బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటుచేయడమే కాక రద్దీ ప్రాంతాల్లో రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని సూచించారు. కాగా, హెల్మెట్, సీట్ బెల్ట్‌తో ఉపయోగాలు, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే ఎదురయ్యే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్‌ఈ హేమలత, డీపీఓ ఆశాలత, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, ఆర్టీఓ వెంకటరమణ, ఏసీపీ శ్రీనివాసులు, విద్యాశాఖ ఆర్ఎంఓ రాజశేఖర్, జిల్లా ప్రధాన ఆస్పత్రి ఆర్ఎంఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జమలాపురంలో ముక్కోటి వేడుకలు



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తర ద్వారం నుంచి స్వామి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈమేరకు స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకోగా ముక్కోటి ఏకాదశి పర్వదినం విశేషాలను ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస శర్మ వివరించారు. ఎస్‌ఐ పి.వెంకటేష్, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేయగా మధిరకు చెందిన సత్యసాయి సేవా సమితి కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు. ఈకార్యక్రమంలో ఈఓ కె.జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, మిథిలా స్టేడియం నిర్మాణదాత తుళ్లూరు కోటేశ్వరరావు –నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఎంపీ వద్దిరాజు



తిరుమలతో ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి గంగుల, వారి కుటుంబీకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తమ కుటుంబ సభ్యులతో శుక్రవారం తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వారు తిరుమల వెళ్లగా ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, మాజీ మంత్రికి ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర..



సత్తుపల్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో శ్రీవారిని శుక్రవారం తెల్లవారుజామున మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దంపతులు దర్శించుకున్నారు.

ఉత్కంఠగా ఫుట్‌బాల్, టెన్నిస్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి విద్యుత్ శాఖ ఉద్యోగుల క్రీడాపోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్, లాన్ టెన్నిస్ పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. లాన్ టెన్నిస్‌లో కరీంనగర్ జట్టు మొదటిస్థానంలో నిలవగా విద్యుత్ సౌధ(హైదరాబాద్) రెండో స్థానంలో నిలిచింది. అలాగే, ఫుట్‌బాల్ పోటీలు సైతం ముగింపు దశకు చేరాయి. శనివారం ఉదయం ఖమ్మం, కరీంనగర్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని టోర్నీ నిర్వాహకులు బి.బాబునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ జగన్నాథం, డీఈలు నాగరాత్నం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు సత్వరమే ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

బోనకల్: ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం ఆయన ఆయన మాట్లాడుతూ డీఏల ప్రకటనతో పాటు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అలాగే, కేజీబీవీ టీచర్లకు మినిమమ్ టైం స్కేల్ అమలు, గురుకులాల్లో సమయపాలన మార్పు, హెల్త్‌కార్డుల జారీ, సమగ్ర సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లింపుపై స్పందించాలని కోరారు. కాగా, ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని మరోమారు శాసనమండలికి పంపించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సద్దాబాబు, సీహెచ్.రంగారావు, కోటయ్య, నాగమహేష్, సీహెచ్.కోటేశ్వరావు, వి.రామారావు, సురేష్, పి.రవి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

సంక్రాంతికి వస్తున్నాం..!

బస్టాండ్లలో జన జాతర



కొత్తగూడెం బస్టాండ్‌లో రద్దీ

జిల్లాలోని బస్టాండ్లు జాతరను తలపిస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో శుక్రవారం విద్యార్థులతో వారి తల్లిదండ్రులు స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి మొదలైన రద్దీ రాత్రి వరకు కొనసాగింది. దాదాపు అన్ని బస్సులు సామర్థ్యానికి మించి ప్రయాణికులతో వెళ్తున్నప్పటికీ ఇంకా పలువురు వేచి ఉండడం కనిపించింది. హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్ పరిధిలోని పలు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు ప్రకటించిన అధికారులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులను కూడా ఇందుకోసం వినియోగిస్తుండడంతో గ్రామాలకు సర్వీసుల సంఖ్య తగ్గింది. ఈ నేపథ్యాన అరకొరగా ఉన్న బస్సులు ఎక్కేందుకు పోటీ పడ్డారు.

– ఖమ్మంమయూరిసెంటర్ / స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఖమ్మం పాత బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



కిటకిటలాడుతున్న భద్రాచలం బస్టాండ్



ఖమ్మం పాత బస్టాండ్‌లో కోదాడ బస్సు వద్ద రద్దీ

'అమృత్' పథకానికి అడుగులు..

- గతంలోనే రూ.249 కోట్లు మంజూరు.. టెండర్ల పూర్తి
- అండర్ డ్రెయిన్ల నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన
- నీటి శుద్ధి యూనిట్లతో తీరనున్న మురుగు సమస్య



ట్రంక్ లైన్ నిర్మాణానికి సిద్ధం చేసిన సిమెంట్ పైప్‌లు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో ఏళ్లుగా పెండింగ్ ఉన్న అమృత్ పథకం పనుల్లో ఎట్టకేలకు కదలిక మొదలైంది. జిల్లా కేంద్రంలో మురికికూపంగా మారిన ఖానాపురం అలుగువాగుతో పాటు అనుబంధంగా ఉన్న వాగులను గోళ్లపాడు ఛానల్ తరహాలో ఆధునికీకరించి అండర్ డ్రెయిన్ నిర్మాణానికి ఖమ్మం కార్పొరేషన్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అమృత్ పథకం–2లో భాగంగా అండర్ డ్రెయిన్ల నిర్మాణం, మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాటుకు గతంలోనే రూ.249 కోట్ల నిధులు మంజూరు కాగా టెండర్లు సైతం పూర్తయ్యాయి. ఈ పనులకు రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేసే అవకాశముంది. ఇందుకోసం ఖమ్మం బైపాస్‌రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం శిలాఫలకం ఏర్పాటుచేయగా, అండర్ డ్రెయిన్ నిర్మాణానికి సిమెంట్ పైపులను కూడా అక్కడకు చేర్చారు.

19డివిజన్లలో మురుకుగు చెక్

అమృత్ పథకంలో భాగంగా అండన్ డ్రెయినేజీలు నిర్మించడంతో పాటు మురుగునీరు శుద్ధి చేసే యూనిట్లను సైతం ఏర్పాటు చేస్తారు. ఖమ్మంలోని 1నుంచి 15వ డివిజన్ వరకు(8వ డివిజన్ మినహా), సమీపంలోని మరో ఐదు డివిజన్ల పరిధిలో మురుగునీరు బయటకు కానరాకుండా ముందుకు సాగేలా అండర్ డ్రెయిన్ నిర్మిస్తారు. ప్రస్తుతం ఈ డివిజన్ల పరిధిలోని మురుగునీరు ఖానాపురం అలుగువాగు, ఇతర కొన్ని మార్గాల్లో గొల్లగూడెం(వెలుగుమట్ల), ధంసలాపురం పెద్ద చెరువుల్లోకి చేరుతుండగా అక్కడి నీరు కలుషితమవుతోంది. అలాగే, స్థానికులు దుర్వాసనతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యాన మురుగునీరు అందులో నేరుగా కలవకుండా అండర్ డ్రెయిన్ నిర్మించి మార్గమధ్యలో మురుగుశుద్ధి యూనిట్లు ఏర్పాటుచేస్తారు. ఫలితంగా నీరు పరిశుభ్రమయ్యాక చెరువుల్లోకి చేరుతుందని, తద్వారా నీరు కాలుష్యం కాకపోగా చేపల పెంపకానికి సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు.

ట్రంక్‌లైన్ 11 కిలోమీటర్లు

అండర్ డ్రెయిన్ నిర్మాణంతో అనేక కాలనీల్లో మురుగునీటి సమస్య తప్పనుంది. ఈమేరకు తొలుత అలుగువాగు మార్గంలో మురుగునీరు వెళ్లేలా పైపులైన్ ఏర్పాటుచేస్తారు. అంతేకాక వర్షపు నీటి ముందుకు సాగేందుకు ట్రంక్‌లైన్ డ్రెయిన్ సైతం సుమారు 11 కి.మీ. మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఖానాపురం ఊర చెరువు మొదలు ప్రశాంతినగర్, చైతన్యనగర్, వరదయ్యనగర్, కవిరాజ్‌నగర్ మీదుగా ధంసలాపురం, గొల్లగూడెం చెరువుల వరకు ఈ డ్రెయిన్ నిర్మిస్తారు. ఖమ్మం 10వ డివిజన్‌లోని చైతన్యనగర్ వద్ద సుమారు 87 అడుగులతో ఈ డ్రెయిన్ ఉంటుందని అంచనా. ఈ పనులు పూర్తయితే గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదలతో కొన్ని ప్రాంతాలకు ఏర్పడిన ముప్పు ప్రమాదం భవిష్యత్‌లో ఉండదని అధికారులు చెబుతున్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి సగిలి ప్రకాష్



వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న బిషప్ సగిలి ప్రకాష్, తదితరులు

తల్లాడ: క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అందించడం ద్వారా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి సగిలి ప్రకాష్ తెలిపారు. తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి జూనియర్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ థామస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఠాధిపతి మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి బిషప్ పాల్ మైపన్ స్థాపించిన క్రీస్తు జ్యోతి జూనియర్ కళాశాల ద్వారా ఉన్నత విలువలతో కూడిన విద్యనందిస్తుండడం అభినందనీయమన్నారు. కాగా, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నిత్య నూతనంగా నిలుస్తూ సమాజ శ్రేయస్సు పాటుపడాలని సూచించారు. అనతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీస్తుజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌తో పాటు ఎస్.గోవా సౌరయ్య, అమృతరాజు, ఫ్రాంచీస్, సుధాకర్, అజయ్, నిర్మల, అమల్, దాసరి దానియేలు, కోపెల్లి అప్పారావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



వివరాలను తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కామేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని యూనిసెఫ్ కన్సల్టెంట్ నరసింహారావుతో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం సైదులు మాట్లాడుతూ గ్రామీణ పేదలు ప్రభుత్వ దవాఖానాలను ఆశ్రయిస్తే మెరుగైన వైద్యం అందించడం ద్వారా వారిలో నమ్మకాన్ని పెంచాలని సూచించారు. వ్యాక్సినేషన్, మందుల లభ్యత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, ఉద్యోగులు సుధారాణి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ బంగ్లాలో రాపత్తు సేవ



రాపత్తు సేవలో పాల్గొన్న ఏఎస్పీ, అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ఏఎస్పీ బంగ్లాలో శుక్రవారం రాత్రి శ్రీసీతారామచంద్ర స్వామివారికి రాపత్తు సేవ ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా రామయ్యకు రాపత్తు సేవలు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. వైకుంఠ ఏకాదశి రోజున ఈ సేవలు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. వేడుకల్లో భద్రాచలం న్యాయమూర్తి శివనాయక్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, సతీశ్, సీఐ సంజీవ్‌రావ్, ఎస్‌ఐలు విజయలక్ష్మి, మధుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు మందుతో ఎండిన పంట

రఘునాథపాలెం: మండలంలోని కొర్రాబోడు తండాకు చెందిన ఓ రైతు తన చేనులో పురుగు మందు కొడుతుండగా పక్క రైతు పొలంపై పడడంతో ఎండిపోయిన ఘటన ఇది. మండలంలోని కొర్రబోడు తండాకు చెందిన జి.రవి రెండు రోజుల క్రితం మొక్కజొన్న పంటకు కలుపు మందు కొట్టాడు. అయితే, పక్కనే ఉన్న వీరన్న పెసర పంటపై కూడా కలుపు మందు పడడంతో పైరు ఎండిపోయింది. దీంతో వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

అలరించిన 'ఏరు' సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని గోదావరి తీరంలో నిర్వహిస్తున్న ఏరు(రివర్ ఫెస్టివల్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థినులచే శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు, పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్‌కుమార్, వీరస్వామి, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ఆర్డీఓ దామోదరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



వాహనదారులు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంక్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనదారులు ప్రమాదంలో పడడమే కాక ఎదుటి వారిని ఆపదలోకి నెట్టినట్లవుతుందని ఏఎంవీఐ స్వర్ణలత అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవం సందర్భంగా ఖమ్మం రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. తద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐలు గోపీకృష్ణ, సుమలత, రవిచందర్, సిబ్బంది రమేష్, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మమతా రోడ్డులో వీధి వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగిస్తుండడంతో పాటు రహదారుల వెంట చెత్త వేస్తున్నారు. ఈ విషయమై అందిన ఫిర్యాదుతో డివిజన్ జవాన్, సానిటరీ సూపర్‌వైజర్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులకు రూ.6,500 జరిమానా విధించి వసూలు చేశారు.

సింగరేణిలో 'ఆక్టోపస్' పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ప్రత్యేక భద్రతా బృందం(ఆక్టోపస్) సందర్శించింది. కార్యాలయ ఆవరణ, పలు విభాగాలను తనిఖీ చేసినట్లు తెలిసింది. అనుకోని ప్రమాదాలు సంభవించిన క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించి, బ్లూ ప్రింట్లు రూపొందించినట్లు సమాచారం. ఆపై సమాచార శాఖను కూడా పరిశీలించినట్లు తెలిసింది. తొలిసారిగా ఆక్టోపస్ బృందం సింగరేణి కార్యాలయానికి రావడం చర్చనీయాంశంగా మారగా ముందస్తు ఏర్పాట్లలో భాగమేనని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆచార్లగూడెంలో డబుల్ ఇళ్ల వద్ద ఉద్రిక్తత

పురుగుమందు డబ్బాలతో మహిళల నిరసన



పురుగుల మందు డబ్బాలతో తహసీల్దార్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు కేటాయించలేదంటూ మండలంలోని ఆచార్లగూడెంలో పలువురు శుక్రవారం నిరసన తెలిపారు. గ్రామంలో నిర్మాణం పూర్తయిన 18 ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈక్రమాన శుక్రవారం పనులను పలువురు అడ్డుకున్నారు. ఇళ్ల వద్దకు అధికారులు రాకుండా ముళ్ల కంచె వేయడంతో పాటు పురుగు మందుల డబ్బాలతో ఆందోళనకు దిగారు. గ్రామ సభ నిర్వహించకుండా ఏకపక్షంగా లబ్దిదారులను ఎంపిక చేశారని ఆరోపించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ జె.మాణిక్‌రావ్, ఎస్సై పి.సంతోష్, ఆర్‌ఐ ఆలస్యం మధుసూదన్‌రావు చేరకుని వారితో చర్చించారు. అర్హత కలిగిన వారు ఉంటే జాబితా ఇవ్వాలని, విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో నిందితురాలికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయధికారి ఏపూరి బిందుప్రియ తీర్పు చెప్పారు. శుక్రవారం వెలువడిన ఈ తీర్పు వివరాలు... ఖమ్మం పాండురంగాపురానికి చెందిన భుక్యా స్వామి వద్ద ఖమ్మం వాసి జి.కరుణ 2014 అక్టోబర్ 5న రూ.3.50 లక్షలు అప్పు తీసుకుంది. ఆపై స్వామి ఒత్తిడితో 2015 అక్టోబర్ 7న రూ.3.50 లక్షలకు చెక్కు జారీ చేయగా బ్యాంకులో జమ చేస్తే సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. దీంతో ఆయన తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఆపై విచారణలో నేరం రుజువు కావడంతో కరుణకు జైలు శిక్ష విధించడమే కాక రూ.3.50లక్షలను ఫిర్యాదికి చెల్లించాలని తీర్పు చెప్పారు.

25 మందిపై బైండోవర్ కేసులు

సత్తుపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట నిర్వహించకుండా సత్తుపల్లి మండలంలో 25 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు. ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం బేతుపల్లిలో శుక్రవారం పూరిళ్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఐనంపూడి రమేష్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి, నిత్యావసరాలు కాలిపోయి నిరాశ్రయులు కావడంతో ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

బయటకు వెళ్లొచ్చే సరికి చోరీ

కామేపల్లి: పనిపై వెళ్లొచ్చే సరికి బీరువాలో భద్రపర్చిన నగదు, ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని పింజరమడుగుకు చెందిన గుండ్లపల్లి ఎల్లమ్మ గురువారం పనిపై బయటకు వెళ్లింది. ఆమె ఇంటికి తాళం వేయలేదని గమనించిన నిందితులు లోపల బీరువాలో దాచిన రూ.40 వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.16 వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

మధిరలో మరో బైక్ చోరీ

మధిర: మధిరలో చోరీల పరంపర ఆగడం లేదు. వారంలో రెండు, మూడు చోట్ల బైక్ చోరీలు సర్వసాధారణంగా మారాయి. స్థానిక రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు గంపలగూడెం మండలం దుందిరాలపాడుకు చెందిన సంగెపు వెంకటేశ్వర్లు తన హీరో వాహనాన్ని శుక్రవారం సాయంత్రం పార్క్ చేశాడు. ఆయన స్టేషన్‌లోకి వెళ్లొచ్చేసరికి బైక్ లేకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక చోరీ గురైనట్లు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

కాలు లేదా చేయి విరగ్గొడితే రూ.1.50 లక్షలు!

రఘునాథపాలెం: ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ నడుమ ఏర్పడిన వివాదంతో యజమానిపై డ్రైవర్ దాడి చేయించగా, ఆపై దాడికి పాల్పడిన వ్యక్తిని కొట్టించేందుకు సుపారీ ఇచ్చిన ఘటన ఇది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాలు... మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన జి.రాజశేఖర్‌కు ట్రాక్టర్ ఉండగా డ్రైవర్‌గా అదే గ్రామానికి చెందిన తేజ పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం ఇరువురి మధ్య వివాదం ఏర్పడడంతో విషయాన్ని తేజ తన మిత్రుడైన ఠాగూర్‌కు చెప్పగా ఆయన రాజశేఖర్‌ను కొట్టాడు. దీన్ని మనసులో పెట్టుకున్న రాజశేఖర్ గార్ల నుంచి వీ.వీ.పాలెం వచ్చి ఆటో నడుపుకునే రవీందర్‌తో మాట్లాడాడు. తనతో గొడవ పడిన ఠాగూర్ చేయి లేదా కాలు విరగ్గొడతే రూ.1.50 లక్షలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుని రూ.30వేలు చెల్లించాడు. మిగతా డబ్బు చెల్లించే క్రమాన విషయం బయటపడడంతో ఆటోడ్రైవర్ రవీందర్, సుపారీ మాట్లాడుకున్న రాజశేఖర్‌పై శుక్రవారం కేసు నమోదు చేసి రూ.30వేల నగదు, బంగారు గొలుసు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ.. ఇద్దరి అరెస్ట్

ఖమ్మంక్రైం: రైలు దిగే క్రమాన మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు జీఆర్పీ సీఐ అంజలి తెలిపారు. మధిరలో ఈనెల 2న శాతవాహన ఎక్స్‌ప్రెస్ దిగుతున్న మహిళ మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లే క్రమాన సగం మేర తెగిపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఖమ్మం స్టేషన్‌లో జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు నేతృత్వాన తనిఖీ చేస్తుండగా చింతకాని మండలం లచ్చగూడెంకు చెందిన కోమ్మ రామకృష్ణ అనుమానాస్పదంగా కనిపించడంతో ప్రశ్నించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఆయనతో పాటు సీతంపేటకు చెందిన పోలూరి పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి గొలుసు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.